


కలెక్టర్‌చే ఇవిఎం గొడౌన్ తనిఖీ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి శనివారం తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్ వద్ద సిసి కెమెరాలతో చేసిన భద్రతా ఏర్పాట్లను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇవిఎం యంత్రాలు బియులు, సియులు, వివి ప్యాట్‌లను, అక్కడి భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం పరిశీలన రిజిస్టర్‌లో కలెక్టర్ సంతకం చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్ తనిఖీ చేశారు. ఇవిఎం గోడౌన్‌కు వేసిన భద్రతా సీళ్ల, సీసీ కెమెరాలు పనితీరు, అగ్నిమాపక దళ పరికరాలు పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారతీయ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇవిఎం గోడౌన్‌కు పటిష్ట భద్రత కల్పించామన్నారు. ఎప్పటికప్పుడు గోడౌన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేసి ఎన్నికల సంఘానికి నివేదిక పంపిస్తున్నామని తెలిపారు. ఇవిఎం గోడౌన్ వద్ద విధులు నిర్వర్తిస్తున్న పోలీస్ గార్డులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు.

కలెక్టర్‌గారూ..పట్టించుకోరా..!



బదిలీల కౌన్సెలింగ్‌కు వచ్చిన పంచాయతీ రాజ్‌శాఖ ఉద్యోగులు

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సచివాలయ ఉద్యోగుల బదిలీలు

వికలాంగులు, స్పౌజ్ ఉద్యోగులకు అమలు కాని సడలింపులు

ఎంఎల్ఎ సిఫార్సు లేకపోతే ఏదీ వర్తించదని హుకుం

పంచాయతీరాజ్‌శాఖ అధికారుల తీరు మరింత వివాదాస్పదం

భార్యాభర్తలను విడదీస్తున్న ఎంఎల్ఎల లేఖలు

సిఫార్సు లేఖల ఆధారంగా జాబితాలు ముందే తయారు చేసి కౌన్సెలింగ్ పేరుతో మాయ

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలను ఆయా శాఖల ఉన్నతాధికారులు ఇష్టానుసారంగా నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ నిబంధనలను సైతం పాటించకుండా పైరవీలకు ప్రాధాన్యత ఇస్తూ వికలాంగులు, స్పౌజ్ కేటగిరీ ఉద్యోగుల పట్ల అమానుషంగా వ్యవహరిస్తున్న పరిస్థితి ఉంది. దీంతో కలెక్టర్‌గారూ.. మీరైనా పట్టించుకుని, నిబంధనలు అమలయ్యేలా చూడాలని సచివాలయ ఉద్యోగులు వేడుకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 1100కుపైగా గ్రామ, వార్డు సచివాలయాలు ఉండగా, దాదాపు 8,500 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. ఐదేళ్ల పూర్తి చేసుకున్న ఉద్యోగులందరికీ బదిలీ తప్పనిసరి చేయడమే కాకుండా, రిక్వెస్ట్ బదిలీలకు సైతం ప్రభుత్వం అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వికలాంగులు, స్పౌజ్ (భార్య, భర్త ఉద్యోగులైతే దగ్గర బదిలీ చేసేలా) కేటగిరి వారికి మొదటి అవకాశం కల్పించాలి వంటి నిబంధనలను ఉత్తర్వుల్లో పేర్కొంది. సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారం చూస్తున్న ఆయా శాఖల జిల్లా అధికారులు మాత్రం నిబంధనలకు విరుద్ధంగా ముందుకు సాగుతున్నారు. శుక్రవారం పంచాయతీ శాఖకు సంబంధించిన ఉద్యోగులను ఏలూరు పిలిపించి ఆప్షన్ ఫారాలను తీసుకున్నారు. శనివారం సర్వే, పంచాయతీరాజ్, వ్యవసాయ శాఖలకు చెందిన ఉద్యోగులంతా ఏలూరు వచ్చి ఆయా శాఖల కార్యాలయాల్లో ఆప్షన్ ఫారాలు ఇచ్చి వెళ్లారు. వాస్తవానికి ఉద్యోగులను ఏలూరు పిలిపించి కౌన్సెలింగ్ పేరుతో చేస్తున్న హడావుడి అంతా వట్టి బూటకమని శనివారం తేలిపోయింది. ఎంఎల్ఎల సిఫార్సు లేఖల ఆధారంగా బదిలీల జాబితా ఇప్పటికే అధికారులు తయారు చేసేశారనే చర్చ ఉద్యోగుల్లో నడుస్తోంది. ఎంఎల్ఎ సిఫార్సు లేఖ లేకపోతే ఆప్షన్ ఫారంలో పేర్కొన్న మూడు స్థానాల్లో ఏఒక్క స్థానమూ ఇవ్వడం సాధ్యంకాదని అధికారులు నేరుగా చెబుతున్న పరిస్థితి ఉంది. పంచాయతీరాజ్‌శాఖలో ఈ పరిస్థితి అత్యంత దారుణంగా ఉందనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్పౌజ్, వికలాంగుల కేటగిరీలో ఉన్న ఉద్యోగులను సైతం ఎంఎల్ఎ సిఫార్సు లేఖ లేదంటూ ఆప్షన్లుగా పెట్టిన స్థానాలను తిరస్కరించిన పరిస్థితి ఆ శాఖలో యథేచ్ఛగా సాగింది. ఎంఎల్ఎల సిఫార్సు లేఖల పేరుతో భార్యాభర్తలను విడదీయడమే కాకుండా, వికలాంగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి ఉంది. ఎంఎల్ఎ సిఫార్సు లేఖ ఇవ్వకుంటే ఆప్షన్ ఫారంలో పేర్కొన్న ఏఒక్కస్థానం ఇవ్వడం కుదరదని ఆయా శాఖల జిల్లా అధికారులు చెబుతున్న తీరు అత్యంత దారుణంగా మారింది. ప్రభుత్వ ఉత్తర్వుల్లో ఎంఎల్ఎ సిఫార్సు లేఖలు ఉండాలని ఎక్కడైనా ఉందా అనేది అధికారులే చెప్పాలి. వికలాంగులు, స్పౌజ్ కేటగిరి ఉన్న ఉద్యోగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వకుండా సిఫార్సు లేఖలు అడగడం చూస్తే బదిలీల వ్యవహారం ఎంత అడ్డగోలుగా సాగుతుందో అర్థం చేసుకోవచ్చు. నిబంధనలు పాటించకుండా గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగుల బదిలీలు జరుగుతున్నా అడిగే నాథుడే లేకుండాపోయాడు.

బదిలీలపై కలెక్టర్ జోక్యం చేసుకోవాలని చర్చ

సచివాలయ ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో ఆయా శాఖల అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ జోక్యం చేసుకుని అంతా నిబంధనలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చాక నిబంధనలకు పూర్తిగా తిలోదకాలు ఇచ్చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్పౌజ్, వికలాంగుల కేటగిరీకు సడలింపులను సైతం సరిగా అమలు చేయకపోవడంతో పలువురు ఉద్యోగులు కోర్టును ఆశ్రయించే ఆలోచన సైతం చేస్తున్నారు. బదిలీల్లో అధికారులు వ్యవహరిస్తున్న తీరుపై కలెక్టర్ జోక్యం చేసుకుని స్పౌజ్, వికలాంగులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వడంతోపాటు, నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భార్య పుట్టింటి నుంచి రావడం లేదని..

కుమార్తె గొంతు కోసిన కన్నతండ్రి

అనంతరం అతనూ పీక కోసుకుని ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్, చింతలపూడి

మద్యం మహమ్మారి రక్త సంబంధాలను సైతం తుంచేస్తోంది. అయినా పాలకులకు మాత్రం చీమకుట్టినట్లు కూడా ఉండటం లేదు. మద్యం మహమ్మారి ప్రభావం జిల్లాలో మరో కుటుంబంపై పడింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. లింగపాలెం మండలం కాటంరెడ్డిపల్లికి చెందిన గంటా రాధాకృష్ణకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. రాధాకృష్ణ మద్యానికి బానిసై వేధిస్తుండటంతో తట్టుకోలేక భార్య తన పెద్దకుమార్తెను తీసుకుని పుట్టింటికి వెళ్లిపోయింది. చిన్న కుమార్తె మాత్రం నాన్నమ్మ వద్ద ఉండిపోయింది. ఈ క్రమంలో భార్య శాంతకుమారిని కాపురానికి రమ్మని పిలిచినా మద్యం అంశం రీత్యా తాను ఇబ్బందులు పడలేనని స్పష్టం చేసింది. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సమయంలో తన భార్య తిరిగి తన వద్దకు రావడం లేదని సైకోలా మారిన రాధాకృష్ణ పొగాకు కోసే కత్తితో తొలుత తన చిన్న కుమార్తె ప్రిన్సీ (5)పై దాడి చేయడంతో బాలిక మెడపై గాయమైంది. దీన్ని గమనించిన ప్రిన్సి నానమ్మ కేకలు వేయడంతో రాధాకృష్ణ బాలికను వదిలేసి అదే కత్తితో తాను పీక కోసుకునేందుకు ప్రయత్నించి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న ధర్మాజీగూడెం ఎస్ఐ ఎ.వెంకన్న హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అప్పటికే ధర్మాజీగూడెంలో ఉన్న చింతలపూడి సిఐ క్రాంతికుమార్ కూడా అక్కడకు చేరుకుని తీవ్ర గాయాలు పాలైన బాలికను తన పోలీసు వాహనంలో హుటాహుటీన ధర్మాజీగూడెం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అదే క్రమంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన రాధాకృష్ణను ఎస్ఐ వెంకన్న 108 వాహనంలో ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం వీరిద్దరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. ధర్మాజీగూడెం పోలీసులు రాధాకృష్ణపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దీనిపై శనివారం రాత్రి జంగారెడ్డిగూడెం డిఎస్‌పి రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ చిన్న పిల్లలపై ఎవరైనా దాడులకు పాల్పడినా, లైంగిక దాడులకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలి

కలెక్టరేట్ వద్ద పంచాయతీ కార్యదర్శుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న పంచాయతీ కార్యదర్శులు

గ్రామ పంచాయతీ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ కార్యదర్శుల సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కెవిఎల్.తనూజ, సహ అధ్యక్షులు పి.ధర్మగోవింద్ మాట్లాడుతూ గ్రామ సచివాలయాల సర్వేల విధుల నుండి పంచాయతీ కార్యదర్శులకు మినహాయింపు ఇవ్వాలన్నారు. గ్రామ సచివాలయ పరిధిలోనే సర్వేలు చేపట్టి, ఇతర ప్రభుత్వం నిర్దేశించిన పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ కార్యదర్శులను సచివాలయ ఉద్యోగులపై ఉన్న డిడిఒ అధికారం నుంచి తప్పించాలని, సచివాలయ విధుల నిర్వహణ భారం కావడం వల్ల పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయి పనితీరు కనబరచలేకపోతున్నారని తెలిపారు. అలాగే సచివాలయ సిబ్బందిని వారి మండలస్థాయి అధికారులు పర్యవేక్షించుకోవాలని, ఆర్‌అండ్‌బి, రెవెన్యూ భూముల ఆక్రమణలు అన్నింటికీ పంచాయతీ కార్యదర్శులను బాధ్యులుగా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యదర్శులపై తప్పుడు కేసులు నమోదు చేయించి పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని, ఇలాంటి సమయంలో ఉన్నతాధికారుల నుండి సహకారం కూడా అంతమాత్రంగానే ఉంటుందన్నారు. భూఆక్రమణల విషయంలో తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ప్రతి నాలుగు వేలు జనాభా కలిగిన పంచాయతీకి శానిటేషన్ మేస్త్రీలను ఇవ్వాలని, ఇద్దరు పంపు ఆపరేటర్లను ఇవ్వాలని కోరారు. కొందరు గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు సంవత్సర కాలం నుంచి సాంకేతిక కారణాలతో జీతాలు చెల్లించలేదని, తక్షణం వారికి జీతభత్యాలు చెల్లించాలని కోరారు. గ్రామపంచాయతీ స్థాయిలో సర్వేల విషయంలోగాని, ఇతర ప్రభుత్వ కార్యక్రమాల విషయంలోగాని ఉన్నతాధికారులు సరైన సమయం ఇవ్వకుండా ఉద్యోగస్తులను తీవ్ర ఒత్తిడికి గురి చేస్తున్నారన్నారు. ఫలితంగా ఉద్యోగులు శారీరక, మానసిక అనారోగ్యాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తగు సమయపాలన పాటించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. సంఘం సహాయ కార్యదర్శి ఎం.వెంకట్రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.వసంతవాణి ప్రసాద్, శ్రీనివాస వర్మ, సుమలత, గౌతమి తదితరులు పాల్గొన్నారు.

40 మంది విద్యార్థులు రక్తదానం

ఏలూరు అర్బన్ : ఏలూరులోని సర్ సిఆర్‌రెడ్డి పీజీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో 40 మంది విద్యార్థులు రక్తదానం చేశారని జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ డాక్టర్ ఎంబిఎస్ వి.ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సిఆర్ కళాశాల విద్యార్థులు పెద్దఎత్తున రక్తదానం చేయడం సంతోషకరమన్నారు. జిల్లా కలెక్టర్ సహకారంతో ఏలూరు జిల్లాలోని కళాశాలల్లో రక్తదానంపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహించి, పెద్దఎత్తున రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. సేకరించిన రక్త యూనిట్లను తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, డయాలసిస్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామని వివరించారు. అందుకు కళాశాలల యాజమాన్యాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం కావాలని కోరారు. ఈ సందర్భంగా రక్తదానం చేసిన యువకులకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పీజీ కళాశాల కరస్పాండెంట్ కానాల శ్రీనివాస్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కె.రామరాజు, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రమణ, డాక్టర్ ఆర్‌ఎస్‌ఆర్‌కె.వరప్రసాదరావు, పిఆర్‌ఒ కెవి.రమణ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న విద్యార్థులు

సిఇఒకు పట్టదా..!

జెడ్‌పి ఆవరణలో ఉద్యోగ సంఘానికి కేటాయించిన స్థలంలో వ్యాపార కార్యకలాపాలకు ఏర్పాట్లు

నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్నా పట్టించుకోకపోవడం వెనుక ఆంతర్యం ఏమిటో?

కలెక్టర్ జోక్యం చేసుకుంటేనే ప్రజల సొమ్ముకు రక్ష



భవనం కింది అతస్తులో వ్యాపార కార్యకలాపాలకు చేస్తున్న పనులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'జిల్లా పరిషత్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నా సిఇఒ ఉదాశీనంగా వ్యవహరిస్తున్నారా.. జెడ్‌పిలో నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న పనులను సైతం ఆయన చూసీచూడనట్లు వదిలేస్తున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. జిల్లా పరిషత్ ఆవరణలో కలెక్టరేట్‌కు వెళ్లే రహదారి పక్కగా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగ సంఘానికి గతంలో 125 గజాలు స్థలం కేటాయించారు. ఆ స్థలంలో నిర్మించిన భవనంలో వ్యాపార కార్యకలాపాలు సాగించాలని ప్రయత్నించడం ఆది నుంచి వివాదాస్పదమైంది. ప్రభుత్వం ఉచితంగా కేటాయించిన స్థలంలో వ్యాపార కార్యకలాపాలు సాగించడం చట్ట విరుద్ధం. దీనిపై గతంలో పని చేసిన కలెక్టర్ ముత్యాలరాజు స్థలాన్ని వెనక్కి తీసుకునేలా ఆదేశాలు సైతం జారీ చేశారు. ఉద్యోగ సంఘాల నాయకులు ఎన్నో ప్రయత్నాల అనంతరం, అప్పటి కలెక్టర్ కార్తికేయమిశ్రా వ్యాపార కార్యకలాపాలు నిర్వహించబోమని ప్రమాణపత్రం రాయించుకుని తిరిగి భవనం కేటాయించారు. మళ్లీ నిబంధనలు తుంగలో తొక్కుతూ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల భవనంలో వ్యాపార కార్యకలాపాలకు అనుమతిస్తూ జిల్లా పరిషత్ అధికారులు ఉత్తర్వులు జారీ చేయడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. దీనిపై పత్రికల్లో కథనాలొచ్చినా జెడ్‌పి అధికారుల్లో ఏమాత్రం చలనం లేకుండాపోయింది. శనివారం సదరు ఉద్యోగ సంఘ భవనం కింది అంతస్తులో వ్యాపార కార్యకలాపాలకు అనుగుణంగా మార్పులు చేసే పనులు కొనసాగాయి. జిల్లా పరిషత్ సిఇఒ శ్రీహరి దృష్టికి విషయం వెళ్లిన తర్వాత కూడా ఈ విధంగా పనులు జరుగుతున్న తీరు చూస్తే అంతా కుమ్మక్కయ్యారా అనే అనుమానాలు నెలకొన్నాయి. జెడ్‌పి ఆస్తులను కాపాడాల్సిన అధికారులే నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడం ఏమిటో ఏఒక్కరికీ అర్థం కాని పరిస్థితి నెలకొంది. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని తగు చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు. జిల్లా పరిషత్ అధికారులు ఇచ్చిన అనుమతులను వెంటనే రద్దు చేయాలని కోరుతున్నారు.

ఈ స్కూల్‌కు రాకండి

ఎంఇఒ ఆదేశాలతో పిల్లలను పంపేసిన హెచ్‌ఎం



స్కూల్ నుంచి నిరాశతో ఇళ్లకు వెళ్తున్న విద్యార్థులు

ముదినేపల్లి : ప్రతిరోజూలానే సంతోషంగా ఆడుతూ.. పాడుతూ శనివారం కూడా కోడూరు యూపి స్కూల్‌కు 6, 7, 8 తరగతుల విద్యార్థులు వచ్చారు. అయితే ఎంఇఒ నరేష్ కుమార్ ఆదేశాలతో పాఠశాల ప్రధానోపాధ్యాయిని విద్యార్థులను తరగతి గదుల్లోకి రానీయలేదు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలం కోడూరు యుపి పాఠశాలను బేసిక్ ప్రైమరీ పాఠశాలగా ఇటీవల మార్చారు. దీంతో 6, 7, 8 తరగతుల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ నెల 12వ తేదీ నుంచి తమ స్కూల్‌ను ప్రాథమికోన్నత పాఠశాలగా కొనసాగించాలంటూ అధికారులకు వినతిపత్రాలు అందిస్తూ పాఠశాల వద్ద ప్రతిరోజూ నిరసన చేపడుతున్నారు. రెండు వారాలుగా 6, 7, 8 తరగతుల విద్యార్థులు సుమారు 20 మంది ప్రతిరోజూ స్కూల్‌కు వస్తూ హాజరు వేయించుకుంటున్నారు. తాము ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లలేమని పాఠ్యాంశాల బోధన అయిన అనంతరం నిరసన తెలుపుతున్నారు. శనివారం కూడా రోజు మాదిరిగా స్కూల్‌కు వచ్చిన విద్యార్థులను తరగతి గదుల్లోకి రానీయకుండా హెచ్‌ఎం బయటకు పంపించివేశారు. పిల్లలకు టిసీలు ఇచ్చి బయటకు పంపేయండి, భోజనం పెట్టవద్దు, హాజరు వేయవద్దని హెచ్‌ఎంకు ఎంఇఒ ఆదేశాలివ్వడంతో ఈ చర్యకు దిగారు. దీంతో విద్యార్థులు నిరాశతో ఇంటి దారి పట్టారు. పిల్లలను స్కూల్‌లోకి అనుమతించ లేదని తెలుసుకున్న గ్రామ ప్రముఖులు వల్లభనేని శివాజీ గ్రామస్తులతో కలిసి శనివారం మధ్యాహ్నం ముదినేపల్లిలో ఎంఇఒను కలిసి కోడూరులో యుపి స్కూల్‌ను యధాతథంగా కొనసాగించాలని కోరారు. పిల్లలు గ్రామం నుంచి జాతీయ రహదారి వెంబడి పది కిలోమీటర్ల దూరంలో ఉన్న హైస్కూల్‌కు వెళ్లలేరన్నారు. దీనిపై శివాజీ డిఇఒతో మాట్లాడేందుకు ఫోన్‌లో ప్రయత్నించగా ఆమె అందుబాటులోకి రాలేదు. ఈ నెల 30 వరకు చూస్తామని, తమ స్కూల్ యుపి స్కూల్‌గా కొనసాగించకుంటే జులై 1 నుంచి జాతీయ రహదారిపై కోడూరు అడ్డరోడ్డు వద్ద టెంటు వేసి ఆందోళన చేస్తామని శివాజీ ఎంఇఒకు స్పష్టం చేశారు. దీనిపై ఎంఇఒ స్పందిస్తూ డివైఇఒ సోమవారం కోడూరు స్కూల్‌కు వస్తారని, ఆ రోజు తల్లిదండ్రులు, విద్యార్థులు వచ్చి ఇబ్బందులు తెలియజేయాలని సూచించారు.

3 నెలల్లో నారాయణపురం వంతెన పనులు ప్రారంభం

ఎపిఆర్‌డిసి ఛీఫ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - ఉంగుటూరు



వంతెన నిర్మాణానికి ఎస్టిమేషన్ కోసం కొలతలు వేస్తున్న అధికారులు

ఏలూరు కాల్వపై నారాయణపురం వద్ద మూడు నెలల్లో కొత్త వంతెన నిర్మాణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని ఎపి రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎపిఆర్‌డిసి) చీఫ్ ఇంజినీర్ ఎల్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ నెల 15న నారాయణపురం వంతెన దెబ్బతినడంతో రాకపోకలు నిలిపివేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో శనివారం శ్రీనివాసరెడ్డి వంతెనను పరిశీలించారు. అనువణువు క్షుణ్ణంగా పరిశీలించారు. కొత్త వారధి నిర్మాణానికి కొలతలు తీసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోజుకు 200కుపైగా ఆరు రకాల ఆక్వా ఉత్పత్తుల రవాణా వాహనాలు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉందన్నారు. అంతటి ప్రాధాన్యత కలిగిన ఈ వంతెనకు తాత్కాలిక మరమ్మతులు చేసినా ఫలితం ఉండదన్నారు. ఈ వంతెన తొలగించి అదే స్థానంలో 11 మీటర్ల వెడల్పుతో బ్రిడ్జికి ఇరుపక్కలా ఫుట్‌పాత్ నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి సాంకేతిక అనుమతులు వెంటనే పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేస్తే మూడు నెలల్లోనే పనులు ప్రారంభించాలని ఆర్‌అండ్‌బి అధికారులను ఆయన ఆదేశించారు. భారీ వాహనాలు వెళ్లే ప్రత్యామ్నాయ దారులను ఆయన పరిశీలించారు. చేబ్రోలు-తల్లాపురం-నారాయణపురం పుంత రోడ్డును విస్తరించాలని క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పొత్తూరి కృష్ణంరాజు కోరారు. ఎంఎల్ఎ ధర్మరాజు వంతెన సమస్యను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లడం వల్ల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయి పర్యటనకు వచ్చారని కృష్ణంరాజు వెల్లడించారు. గత ప్రభుత్వంలో నాలుగు వరుసల వంతెన నిర్మాణానికి రూ.8.50 కోట్లు మంజూరవ్వగా పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాకపోవడంతో ఆ నిధులు వెనకెళ్లిపోయాయి. ఈ సారి కేవలం రెండు వరుసల వంతెన నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నిర్మాణ వ్యయం కూడా గతంలో వేసిన ఎస్టిమేషన్ కంటే తక్కువయ్యే అవకాశం ఉంది. కార్యక్రమంలో ఎస్ఇ భరతరత్నం, ఇఇ కిషోర్‌బాపూజీ, డిఇ గోవిందమోహన్, ఎఇ పి.భాస్కరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎవరికి వారు యమునా తీరే..!

ఎవరికైనా కష్టం వచ్చినప్పుడు.. ఏదైనా తీరని నష్టం వాటిల్లినప్పుడు పెద్దలు వెళ్లి పలుకరించి ధైర్యం చెప్పి రావడం మానవ సహజ లక్షణాల్లో ఒకటి. తద్వారా ఆ కష్టం తీరకపోయినా.. నష్టం భర్తీ కాకపోయినా తమ వెంట ఈ సమాజం ఉందనే భరోసా కల్పించడమే దీని వెనుక ఉన్న ముఖ్యోద్దేశం. అయితే జిల్లాలోని పాలకులకు, అధికారులకు మాత్రం ఈ సంగతి పట్టకపోవడం చర్చనీయాంశమైంది.

ఏలూరు శాయ్ హాస్టల్‌లో వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారిణులు ఉంటూ వెయిట్‌లిఫ్టింగ్, అథ్లెటిక్స్‌లో శిక్షణ పొందుతున్నారు. అక్కడి బాలికలపై కోచ్ లైంగిక వేధింపులకు పాల్పడటంతోపాటు అసభ్యకరంగా ప్రవర్తించాడని ఫిర్యాదు నేరుగా శాయ్ ప్రధాన కార్యాలయానికి చేరడంతో అక్కడి నుంచి ఒక బృందం రంగంలోకి దిగి రహస్యంగా విచారణ సాగించి వేధింపులు వాస్తవమేనని తేల్చి, పోలీసులకు ఫిర్యాదు చేసే వరకూ బాహ్య ప్రపంచానికి విషయం తెలియరాలేదు. ఆపై ఆరోపణలు వచ్చిన కోచ్‌పై శాయ్ కూడా చర్యలు చేపట్టింది. అలాగే పోలీసులు సైతం కీచక కోచ్‌ను అరెస్టు చేసి కటకటాల వెనుకకు పంపారు. ఇంతవరకూ బాగానే ఉంది. వేరే రాష్ట్రాల నుంచి ఇక్కడకొచ్చి మన దేశ ప్రతిష్టను అంతర్జాతీయస్థాయిలో చాటేందుకు శిక్షణ పొందుతున్న బాలికలపై కనురెప్పలా కాపాడాల్సిన కోచ్‌నే అమానుషంగా ప్రవర్తించడం వారి మానసిక స్థయిర్యాన్ని దెబ్బతీసి ఉండొచ్చు. ఈ పరిస్థితుల్లో జిల్లాలోని ముఖ్య ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు ఆ ప్రాంగణాన్ని సందర్శించి ఆ బాలికలకు ధైర్యం చెప్పాల్సిన అవసరం ఉంది. ఇంకా వారి సమస్యలు ఏమిటో తెలుసుకోవాల్సిన బాధ్యత కూడా ఉంది. అయితే ఇవేమీ మన జిల్లా పాలకులకు పట్టకపోవడం శోచనీయం. జిల్లా రథసారథులుగా మహిళలే కీలక బాధ్యతల్లో ఉన్నారు. ఇటు జెడ్‌పి ఛైర్‌పర్సన్, అటు కలెక్టర్, జెసి అత్యంత ముఖ్యులే. వీరు బాధిత బాలికలను కలిసి ధైర్యం చెప్పడంతోపాటు ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ఆ ప్రాంగణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించి ఉంటే బాగుండేదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. జిల్లా పర్యటనకు విచ్చేసిన పిసిసి అధ్యక్షురాలు షర్మిల సైతం ఈ ఘటనపై స్పందించకపోవడం గమనార్హం. అయితే ప్రచార కార్యక్రమాల్లో ముందుండే పాలకుల్లానే అధికారుల తీరూ తయారైందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



కలెక్టరేట్ల వద్ద అంగన్వాడీలు, మున్సిపల్ కార్మికులు, వివిధ తరగతుల ప్రజానీకం తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఆందోళన చేపట్టారు. ప్రధానంగా చిరుద్యోగులకు సంక్షేమ పథకాల అమలు కోరుతూ ఆందోళనలు సాగుతున్నాయి. దీనిపై ప్రభుత్వం నోరుమెదపడం లేదు. పైగా భీమవరంలో అంగన్వాడీల ఆందోళనను సైతం అడ్డుకునేందుకు పోలీసులు యత్నించడం గమనార్హం. ధర్నాను సైతం అడ్డుకునే ప్రయత్నం చేయడం బట్టి కూటమి పాలకులు సైతం వైసిపి పాలకుల్లానే వ్యవహరిస్తున్నారనే చర్చ సాగుతోంది.

ఇక పాలకులు మారినా విద్యావిధానాలు మారకపోవడంతో ఇటు విద్యార్థులకు, అటు విద్యార్థుల తల్లిదండ్రులకు తిప్పలు తప్పడం లేదు. రేషనలైజేషన్ పేరిట తరగతుల తరలింపు గ్రామాల్లో పేద విద్యార్థులను చదువుకు దూరం చేస్తుందనడంలో ఎటువంటి సందేహమూ లేదు. ముదినేపల్లి మండలం కోడూరు యుపి పాఠశాలను కొనసాగించాలని 20 మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళన సాగిస్తున్నా కనీసం జిల్లా అధికారులు స్పందించిన దాఖలాల్లేవు. పశ్చిమగోదావరి జిల్లాలో పెనుమంట్ర మండలంలో పెనుమంట్ర ఎల్‌ఇ, సూర్యారావుపేట, మార్టేరులోని శివరావుపేట స్కూళ్ల అంశంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ఇష్టానుసారం తరగతుల తరలింపు వల్ల తమ పిల్లలు సదూర ప్రాంతం వెళ్లలేరని తల్లిదండ్రులు మొత్తుకుంటున్నా విద్యాశాఖాధికారుల్లో కదలిక లేని పరిస్థితి. కనీసం జిల్లా అధికారులు సైతం కనీసం నోరు మెదపని పరిస్థితి.

ఇక మండవల్లిలోని తరుగుమూలలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించిన భూముల్లో పోలీసు స్టేషన్ భవన నిర్మాణం వివాదాస్పదమవుతోంది. కామన్‌సైట్‌లో కేవలం ప్రజోపయోగకరమైన కమ్యూనిటీ హాళ్ల వంటివి మాత్రమే నిర్మాణం చేపట్టాలి. దానికి భిన్నంగా పోలీసు స్టేషన్ భవన నిర్మాణం చర్చనీయాంశమైంది. తహశీల్దార్ కార్యాలయం పక్కనే పోలీసు స్టేషన్ భవన నిర్మాణానికి అవకాశం ఉన్నా ఇక్కడే పనులు చేపట్టడంపై ప్రజల్లో అనేక అనుమానాలు నెలకొన్నాయి. దీనికితోడు ఆ భూములను మెరక చేస్తే తాము ఇళ్లు కట్టుకుంటామని ఏళ్ల తరబడి లబ్ధిదారులు కోరుతున్నా పట్టించుకోని ప్రభుత్వం పోలీసు స్టేషన్ నిర్మాణానికి మాత్రం రెండు రోజుల్లో పూడిక చేపట్టడం గమనార్హం. అంటే పాలకులకు పేదల బాగోగుల పట్ల ఏపాటి చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. ఇప్పటికైనా జిల్లా అధికారులు జోక్యం చేసుకుని అక్కడి లబ్ధిదారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సి ఉంది. అయితే పాలకుల తరహాలోనే జిల్లా అధికారులు సైతం అధికార దర్పం ప్రదర్శిస్తున్నారనే విమర్శలు విన్పిస్తున్నాయి.

ఏదేమైనా వరుస ఘటనల్లో పాలకుల వలె జిల్లా అధికారుల్లోనూ కనీస స్పందన కరువైందనే విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ విమర్శలను తిప్పికొట్టేలా జిల్లా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

-వివిఎస్‌ఎస్‌వి.ప్రసాద్

పేదలకు తక్షణమే పట్టాలు ఇవ్వాలి

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణం ఆపాలి

దీక్షలకు మద్దతు తెలిపిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

చెవిలో పువ్వులతో లబ్ధిదారుల నిరసన

ప్రజాశక్తి - మండవల్లి



దీక్షలో పాల్గొని మద్దతు తెలుపుతున్న సిపిఎం నేతలు

పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మాణమనేది పేదలకు ఇళ్లస్థలాలు దక్కకుండా చేయాలనే కుట్రగా ఉందని, ఆ వైఖరిని ఖండిస్తున్నామని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి స్పష్టం చేశారు. ఇళ్లస్థలాలు మెరక చేసి తమకు అప్పగించాలని కోరుతూ స్థానిక రెవిన్యూ కార్యాలయం వద్ద తరుగుమూల ఇళ్లస్థలాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం ఆరో రోజు కొనసాగాయి. లబ్ధిదారులు చెవిలో ఎర్రపువ్వు పెట్టుకుని నిరసన తెలిపారు. ఈ దీక్షా శిబిరానికి ఎ.రవి చేరుకుని లబ్ధిదారులకు మద్దతు తెలిపి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఇళ్ల స్థలాల కోసం న్యాయమైన పోరాటం చేస్తున్నారన్నారు. రెవెన్యూ కార్యాలయాల వద్ద పోలీస్ స్టేషన్‌కు స్థలం కేటాయించినప్పటికీ పేదల ఇళ్ల స్థలాల్లో పోలీస్ స్టేషన్ నిర్మించాలని కోవడం పేదలకు స్థలాలు లేకుండా చేయడమే అన్నారు. అంతేకాకుండా లబ్ధిదారులు పోలీస్ స్టేషన్ నిర్మాణం వద్దన్నట్లు వారిపై దురభిప్రాయాలు తీసుకురావడానికి ప్రయత్నించడం సరికాదన్నారు. పేదల ఇళ్ల స్థలాలలో నిర్మించాలనే వైఖరిని మాత్రమే ఖండిస్తున్నారని తెలిపారు. రీ వెరిఫికేషన్‌ను ఉపసంహరించుకుని తక్షణమే 131 మంది లబ్ధిదారులకు పట్టాలను పంపిణీ చేయాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉద్యమంగా మారుస్తామని హెచ్చరించారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు శ్రీనివాస్ మాట్లాడుతూ గృహ నిర్మాణ శాఖలో ఉన్న పట్టాలను తీసుకొచ్చి లబ్ధిదారులకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాలరావు, లబ్ధిదారులు పద్మ, సింహాచలం, వెంకటరమణ, లీలావతి, చిన్ని, వెంకటేశ్వరమ్మ, రమణ, లక్ష్మి, చింతామణి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్అండ్ఆర్ మిగులు భూములు స్వాధీనం చేసుకోవాలి

ప్రభుత్వానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం విజ్ఞప్తి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి


మాట్లాడుతున్న బి.బలరాం

పోలవరం, చింతలపూడి ఎత్తిపోతల పథకం కింద కొనుగోలు చేసిన ప్రభుత్వ మిగులు భూములను వెంటనే ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ప్రజాసంఘాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని ఆర్అండ్ఆర్ భూముల్లో కొంతమంది వ్యక్తులు పెత్తనం చెలాయించడం చాలా బాధాకరమన్నారు. గిరిజనులు తమ బతుకుదెరువు కోసం ప్రభుత్వ భూమిలో సాగు చేసుకుంటుంటే దౌర్జన్యంగా వారిపై కేసులు బనాయిస్తారని, కాని ప్రభుత్వ భూములపై పెత్తనం చెలాయిస్తూ ఆ భూములను ఇతర వ్యక్తులకు కౌలుకు ఇస్తున్నవారిపై సంబంధిత అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ సమస్యపై ప్రభుత్వం స్పందించకపోతే రానున్న కాలంలో పెద్ద ఎత్తున ఉద్యమానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, జీలుగుమిల్లి, బుట్టాయగూడెం మండల కార్యదర్శులు తెల్లం రామకృష్ణ, తెల్లం దుర్గారావు, మండల కమిటీ సభ్యులు సిరిబత్తుల సీతారామయ్య, చిట్టిబొమ్మ కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల సమస్య పరిష్కరించండి

కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఫ్రాన్సిస్

ప్రజాశక్తి - బుట్టాయగూడెం


మాట్లాడుతున్న ఫ్రాన్సిస్

మండల కేంద్రంలోని రాజీవ్ నగర్ కాలనీలో దళితుల ఇళ్లపై వేలాడుతున్న 11 కెవి విద్యుత్ వైర్లను సరిచేయాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం వేలాడుతున్న తీగలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమస్య గత 40 ఏళ్ల నుంచి ఇదే విధంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. పలు ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయన్నారు. బుట్టాయగూడెం ఎలక్ట్రికల్ ఎఇకి ఎన్నోసార్లు సమస్య వివరించినా పట్టించుకోవడంలేదన్నారు. ఈ నెల 27వ తేదీ మధ్యాహ్నం తీగల వద్ద మంటలు రావడంతో గ్రామస్తులు ప్రాణభయంతో అధికారులకు సమాచారం ఇవ్వగా లైన్మెన్ వచ్చి పైపులు తొడిగారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. రాజీవ్ నగర్ రెండో వార్డ్ మెంబర్ కె.దుర్గారావు మాట్లాడుతూ విద్యుత్ వైర్లు ఇళ్లపై నుంచి వెళ్లడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళనకు గురవుతున్నామన్నారు. గాలి వస్తే మంటలు వస్తున్నాయని చెప్పారు. ఇంటిపై నుండి లైన్ తొలగించాలని ఒగ్గు లూసమ్మ, జి.రమేష్, అంజయ్య, ముక్కమ్మ, దుర్గ, గంధం అక్కమ్మ, కొప్పుల మంగమ్మ కోరారు.

విద్యార్థులకు నేత్ర పరీక్షలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ఎస్ఆర్ఆర్ జెడ్పి బాలుర హై స్కూల్ ఆవరణలో విద్యార్థులకు శనివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఎం డివిఎల్.పుష్పలత మాట్లాడుతూ విద్యార్థుల్లో నేత్ర దృష్టి లోపాలు లేకుండా సరిదిద్దే క్రమంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలో ప్రముఖ వైద్యులు హనుమంతరావు కుమార్తె ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు శ్రావణసంధ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. విద్యార్థులందరికీ నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులను అందించినట్లు చెప్పారు. దృష్టి దోషం ఉన్నవారికి కళ్లజోళ్ళు అందించనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఇటీవల విడుదల చేసిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో ప్రవేశం కోసం ప్రభుత్వం నిర్వహించే ఎపి పీజీ సెట్ పరీక్షా ఫలితాల్లో ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు మంచి ప్రతిభను కనపరిచారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక అభినందన కార్యక్రమంలో ఎంఎస్సి జువాలజీలో రాష్ట్ర స్థాయిలో 16వ ర్యాంకును సాధించిన కె.నవీన్‌కుమార్‌ను ప్రిన్సిపల్ ప్రత్యేకంగా అభినందించారు. జువాలజీలో వరుసగా 245, 354 ర్యాంకులు సాధించిన సిహెచ్.జగదీష్, షేక్ షారూన్‌లను, ఎంఎ పొలిటికల్ సైన్స్‌లో వరుసగా 214, 249, 256 ర్యాంకులు సాధించిన పి.చంద్రశేఖర్, కె.మనోజ్ శ్యామ్‌సాయి, జి.హేమవెంకటసత్యనారాయణలను అభినందించారు. విద్యార్థులకు పీజీ ర్యాంకులు రావడం కోసం తర్ఫీదు ఇచ్చిన జువాలజీ అధ్యాపకులు డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు టివిఎస్.దుర్గాప్రసాద్‌లను ప్రిన్సిపల్, సహచర అధ్యాపకులు ప్రత్యేకంగా అభినందించారు.

మురుగు కాలువలో పూడిక తీత

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఎగువ ప్రాంతాల నుంచి నారాయణపురంలో ఎస్‌సి పేట మురుగు కాలువలోకి వరద, మురుగు చేరుతోంది. దీంతో మురుగు బోదె పూడుకుపోయింది. ఇటీవల వర్షాలకు మురుగు కాలువ పూడిక కారణంగా వరద నీరు దిగువకు వెళ్లే మార్గం లేక లోతట్టు ఇళ్లలోకి చేరాయి. గ్రామస్తులు అవస్థలు ఎదుర్కొన్నారు. ఈ నేపథ్యంలో చెత్తా చెదారం పూడిత తీత పనులను సర్పంచి దిడ్ల అలకనంద ఆధ్వర్యంలో శనివారం చేపట్టారు. జెసిబితో తవ్వి సిల్ట్‌ను ట్రాక్టర్లు మీద దూరంగా తరలించారు.

టిడిపి పట్టణ అధ్యక్షులుగా జగదీష్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

టిడిపి నూజివీడు పట్టణ అధ్యక్షులుగా మల్లిశెట్టి జగదీష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు నూజివీడు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో పార్టీ నుంచి వచ్చిన అబ్జర్వర్ల ఆధ్వర్యంలో మల్లిశెట్టి జగదీష్‌ను పట్టణ అధ్యక్షులుగా ప్రకటించారు. జగదీష్‌కు పార్టీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఆటో కొనుక్కునేందుకు డబ్బులు ఇవ్వలేదని...

ప్రజాశక్తి - టి.నరసాపురం

ఆటో కొనుక్కోవడానికి డబ్బులు ఇవ్వలేదని కలుపుమందు తాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రాజుపోతేపల్లికి చెందిన మహంకాళి వెంకటేశ్వరరావు (38)కు వికలాంగురాలైన భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ క్రమంలో తనకు ఆటో కొనుక్కోవడానికి డబ్బులు కావాలని భార్యను, అతని బావ గుండు గౌరీ శంకర్‌ను అడుగుతుండేవాడు. ఈ నెల 27న వారిని డబ్బులు అడగగా వారు ఇవ్వకపోవడంతో గొడవపడి తనవెంట తెచ్చుకున్న కలుపు ముందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని చింతలపూడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు.

వరి విత్తనాలు సీజ్

నూజివీడు టౌన్ :పట్టణంలోని అన్నదాత విత్తనాల షాపులో జిల్లా రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, వ్యవసాయ శాఖ సంయుక్తంగా శనివారం తనిఖీ చేశారు. స్టాక్ రిజిష్టర్‌కు వ్యత్యాసం ఉన్న 92 బస్తాల వరి విత్తనాలను సీజ్ చేశారు. నరసింహా సీడ్స్, జనరల్ స్టోర్స్‌లో 36 బస్తాలను సీజ్ చేశారు. ఈ తనిఖీల్లో అన్నదాత విత్తనాల షాపులో రూ.1,03,489 విలువైన వరి ధాన్యం, నరసింహా సీడ్స్, జనరల్ స్టోర్‌లో రూ.42,500 విలువైన వరి ధాన్యం అమ్మకాన్ని నిలుపుదల చేశారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ ఎఒ మీరయ్య, తహాశీల్దార్ కన్యాకుమారి, నూజివీడు మండల వ్యవసాయ అధికారి చెన్నారావు పాల్గొన్నారు.

వీధి కుక్కల దాడిలో ఇద్దరికి గాయాలు

ముసునూరు :మండలంలోని రమణక్కపేటలో వీధి కుక్కల దాడిలో ఇద్దరు మహిళలు గాయాలపాలయ్యారు. గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు ఆముదాల కుమారి, ఆముదాల అంజమ్మ ఇరువురు శనివారం పని నిమిత్తం సెంటర్‌కు వెళ్తుండగా వీధి కుక్కలు ఒక్కసారిగా వారిపై దాడి చేశాయి. గాయపడిన వారు రమణక్కపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స పొందుతున్నారు. రమణక్కపేట పంచాయతీలో వీధి కుక్కలు పెరిగిపోయాయని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులపై, మహిళలపై దాడులు చేస్తున్నాయని వాపోతున్నారు.

కారాగారం సందర్శన

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడిలో కరాగరాన్ని మండల న్యాయ సేవాధికార కమిటీ ఛైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన నిందితుల కేసు వివరాలను, వారికి అందిస్తున్న ఆహార పదార్థాలు, తాగునీటి సౌకర్యాలు, అనారోగ్యంగా ఉన్నవారికి అందించే వైద్య సదుపాయాలు, తదితర విషయాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఉచిత న్యాయ సలహాలు, నిందితులకు అందించిన సహాయంపై ఆరా తీశారు. అందరూ బాధ్యతగా పని చేయాలన్నారు. వంటశాలను, స్టోర్ రూమ్‌ను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపకారాగార పర్యవేక్షణ అధికారి కృపానందం, జైలు సిబ్బంది, ప్యానల్ లాయర్స్ టోకూరి వెంకటేష్, రాజు పాల్గొన్నారు.

9న సమ్మె జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - కుక్కునూరు

జులై తొమ్మిదో చేపట్టిన దేశవ్యాప సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పిలుపునిచ్చారు. స్థానిక సుందరయ్య భవనంలో సిఐటియు మండలాధ్యక్షులు కుంజ నాగలక్ష్మి అధ్యక్షతన శనివారం నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎనిమిది గంటల పని దినాన్ని పది గంటలకు పెంచి, కనీస వేతనాలను సవరించకుండా కార్మికులను దోపిడీ చేస్తుందన్నారు. సమస్యల పరిష్కారానికి, డిమాండ్ల సాధన కోసం జులై తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు భారీగా పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో కోశాధికారి బాడీస సుజాత, రాయి రమణ, గొంది దుర్గమ్మ, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

మండలంలోని దండిపూడి బైనేరు చెరువులో గల్లంతై మృతి చెందిన అచ్చియ్యపాలెం పంచాయతీ చినరవ్వవారిగూడేనికి చెందిన మేడి దేవేంద్రకుమార్, తెల్లం సీతారామరాజు, తెల్లం కిశోర్ మృతదేహాలను పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాలను పరామర్శించి ధైర్యం చెప్పారు. కూటమి ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామన్నారు. ఇద్దరు కుమారులను కోల్పోయిన పోసిరావు మాస్టర్‌ను పరామర్శించారు. మృతి చెందిన వారిలో సీతారామరాజు భార్య రజినికి ఉద్యోగం కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సీతారామరాజు మూడేళ్ల కుమార్తెకు అన్నివిధాలా అండగా ఉంటామన్నారు.

అతిసారను నిర్లక్ష్యం చేయొద్దు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

సరిపల్లి ఆరోగ్య కేంద్రంలో అతిసార వ్యాధి నివారణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బయ్యన్నగూడెం పిహెచ్‌సి ఆరోగ్య విస్తరణ అధికారి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఐదేళ్ల లోపు పిల్లల్లో అతిసార వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే ప్రాణాపాయం సంభవించవచ్చని హెచ్చరించారు. మూడు లేదా అంతకంటే ఎక్కువ సార్లు నీళ్ల విరోచనాలు అయితే అది అతిసార వ్యాధిగా పరిగణించాలని, చిన్న పిల్లలకు తక్షణ వైద్యం అందకపోతే ప్రమాదకరమని తెలిపారు. కలుషిత నీరు, ఆహారం ద్వారా ఈ వ్యాధి వ్యాపిస్తుందన్నారు. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీరు, లేదా క్లోరినేషన్ చేసిన నీటిని మాత్రమే తాగాలన్నారు. అతిసార వల్ల శరీరంలోని ఖనిజ లవణాలు కోల్పోయి డీహైడ్రేషన్ సంభవిస్తుందని, లీటర్ మంచి నీటిలో ఒఆర్ఎస్ కలిపి తాగితే ప్రాణాపాయం నివారించవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ భాషా, ఎంఎల్‌హెచ్‌పి కె.విమలదేవి, ఎఎన్ఎం కె.గంగాదేవి, ఆశా కార్యకర్తలు కె.వెంకటలక్ష్మి, ఎం.వరలక్ష్మి పాల్గొన్నారు.

పాడి పశువులకు టీకాలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

స్థానిక మార్కెట్ యార్డ్‌లో పశువులు, గొర్రెల్లో నట్టల నివారణ కోసం ఉచిత టీకా కార్యక్రమం శనివారం నిర్వహించారు. పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వ హించిన ఈ కార్యక్రమంలో పశువులకు గొంతు వాపు, జబ్బ వాపు వంటి వ్యాధుల నివారణకు అవసరమైన టీకాలు అం దించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారులు రైతులకు పశుసంరక్షణ, వ్యాధి నివారణ గురించి అవగాహన కల్పించారు.

శ్రీవారికి రూ.రెండు లక్షల విరాళం

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

ద్వారకాతిరుమల జరగనున్న పవిత్రోత్సవాల నిమిత్తం రూ.రెండు లక్షలు వెచ్చించేందుకు భీమవరానికి చెందిన జివిఎస్ఎస్‌వి.సోమరాజు ఆయన తండ్రి గొట్టిముక్కల భీమరాజు పేరున చెక్కును ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి నటరాజరావుకు అందించారు. దాతకు ఆలయ అధికారులు స్వామివారి ప్రత్యేక దర్శనం, తీర్థ ప్రసాదాలు అందించారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని పెయ్యేరు పంచాయతీలోని ఆటోనగర్‌లో పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న డ్రెయినేజీ నిర్మాణ పనులకు శనివారం ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఎన్నో ఏళ్లుగా ఇబ్బంది పడుతున్న ఆటోనగర్ కాలనీ వాసులు డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి అల్లు సుశీల, వైస్ సర్పంచి దివి సతీష్, గంది రామారావు, శేఖర్ పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు

కుక్కునూరు: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఈ నెల 25వ తేదీన పిల్లల విద్యాభ్యాసంలో తల్లి పాత్ర అంశంపై నిర్వహించిన వ్యాసరచన, వ్యక్తిత్వ పోటీలో విజేతలైన విద్యార్థులకు శనివారం బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు అధ్యక్షతన కుక్కునూరు ఉప సర్పంచ్ పిచ్చుక రాజు చేతులమీదుగా విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం, ప్రభుత్వం ఉచితంగా సరఫరా చేసిన ఎంసెట్, నీట్ స్టడీ మెటీరియల్స్, పాఠ్య, నోటు పుస్తకాలు విద్యార్థులకు పంపిణీ చేశారు.

మొక్కలు నాటాలి

మండవల్లి :స్వార్థం లేకుండా పర్యావరణానికి, మానవాళికి మంచి చేసే గుణం చెట్లలోనే ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్.భాస్కరరావు స్పష్టం చేశారు. మొక్కలను నాటి చెట్లుగా పెంచుతున్న ప్రొఫెసర్ సుధాబత్తుల విజయ్‌కుమార్‌ను ఈ సందర్భంగా ఆయన అభినందిం చారు. ఆయన మాట్లాడుతూ విజయ్‌కుమార్ రైల్వే స్టేషన్, ఎంపిడిఒ కార్యాలయం, జెడ్‌పి హైస్కూల్, గ్రంథాలయం, పిహెచ్‌సి తదితర ప్రాంతాలలో 200కు పైగా మొక్కలు నాటి ట్రీ గార్డులను ఏర్పాటు చేసి పరిరక్షిస్తూ చెట్లుగా పెంచుతున్నారన్నారు. పర్యావరణ ప్రేమికులు వీరిని ఆదర్శంగా తీసుకుని వాతావరణంలో సమతుల్యత కోసం మొక్కలు నాటాలని కోరారు.

పూర్తికాని కల్వర్టు నిర్మాణం

60 మంది విద్యార్థులు నిత్యం 12 కిలోమీటర్ల ప్రయాణం

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఆర్అండ్‌బి రోడ్డులో కల్వర్టు నిర్మాణ పనులు

రావులపర్రు-కోనాల ఆర్అండ్‌బి రహదారిలో కాగుపాడు వెళ్లే దారిలో కల్వర్టు పనులు అసంపూర్తిగా మిగిలాయి. ఈ కారణంగా రావులపర్రు నుంచి కాగుపాడు జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వెళ్లే సుమారు 60 మంది విద్యార్థులు రోజుకు అటు ఇటూ 11.5 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. ఈ కల్వర్టు పూర్తయితే కేవలం రానూ పోను ఏడు కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. బొమ్మిడి, కాగుపాడు, రావులపర్రు గ్రామాలకు చెందిన పొలాల్లో వరద, మురుగు నీరంతా ఇప్పుడు నిర్మిస్తున్న కల్వర్టు ద్వారా తోకలపల్లి ప్రధాన మురుగు కాలువలోకి వెళ్లాల్సి ఉంది. 2022లో అధిక వర్షాలకు మట్టి కోసుకుపోయి తూరలు పగిలిపోయాయి. అప్పటి నుంచి నిధులు లేవు. రావులపర్రు వద్ద పత్తేపురం పంట కాలువపై వంతెనతో పాటు ఈ కల్వర్టు నిర్మాణానికి రూ.80 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఈ క్రమంలో కాంట్రాక్టర్ పది రోజుల క్రితం రోడ్డును తవ్వి సిమెంటు కల్వర్టు నిర్మించారు. బాగా ఆరిన తరువాత రోడ్డును యథా స్థితికి తేవటానికి సమయం పట్టేలా ఉంది. దీంతో విద్యార్థులతో పాటు రైతులు, గ్రామస్తులు చుట్టూ తిరిగి గమ్యస్థానాలకు వెళ్లాల్సి వస్తోంది.

గ్రంథాలయ నిర్మాణానికి ప్రతిపాదనలు రూపొందించాలి

సంబంధిత అధికారులకు జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి ఆదేశం


ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరులోని జిల్లా కేంద్ర గ్రంథాలయం కోసం నూతన భవన నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు రూపొందించి గ్రంథాలయ సంస్థల డైరెక్టర్ అనుమతిని తీసుకుని నిర్మాణ పనులు చేపట్టాలని జాయింట్ కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌ఛార్జి పి.ధాత్రిరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని జాయింట్ కలెక్టర్ కార్యాలయంలో శనివారం జిల్లా కేంద్ర గ్రంథాలయం సర్వసభ్య సమావేశం ఆమె అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ జిల్లా కేంద్ర గ్రంథాలయ భవనం శిథిలావస్థకు చేరి ప్రమాద స్థితిలో ఉన్న కారణంగా ఆ స్థానంలో కొత్త భవనం నిర్మాణానికి నిబంధనలు అనుసరించి గ్రంథాలయ సంస్థల డైరెక్టర్ అనుమతి మేరకు నిర్మాణ పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాలు, గ్రంథాలయానికి వచ్చే చదువరులకు అవసరమైన సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. శాఖగ్రంథాలయాల్లో సిబ్బంది పనిచేసిన కాలంలో పోయిన పుస్తకాల నగదును ఉద్యోగుల నుంచి రికవరీ చేయాలని ఆదేశించారు. స్థానిక సంస్థలు, వివిధ సంస్థల నుంచి గ్రంథాలయాల సెస్సు బకాయిలను వసూలు చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థకు సంబంధించిన ఖర్చులపై సమీక్షించారు. ఈ సమావేశంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎం.శేఖర్‌బాబు, జిల్లా పంచాయతీ అధికారి కె.అనురాధ, వయోజన విద్య ఉప సంచాలకులు ప్రభాకర్, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి యు.సురేంద్రనాథ్, జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ, సీనియర్ అసిస్టెంట్ అర్.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పేదల సాగు భూములకు పట్టాలివ్వాలి

వ్యకాస జిల్లా కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


మాట్లాడుతున్న రామకృష్ణ

పేదలు సాగు చేస్తున్న భూములకు పట్టాలు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని మైసన్నగూడెంలో సర్వే నెంబర్ 120/2లో పేదలు సాగు చేస్తున్న ఐదు ఎకరాల భూమిని ఆయనతో పాటు జిల్లా అధ్యక్షులు ఎం.జీవరత్నం పరిశీలించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పేదలు సాగు చేస్తున్న భూములకు ప్రభుత్వం పట్టాలు ఇవ్వాలన్నారు. కొన్నేళ్లుగా మామిడి, జీడి, జామాయిల్ తదితర పంటలు సాగు చేసుకుంటున్న పేదలను గ్రామాల్లో ఉన్న భూస్వాములు, అధికార పార్టీ నాయకులు ఇబ్బందులకు గురి చేస్తున్నారన్నారు. భూస్వాములు ప్రభుత్వాన్ని, అధికార యంత్రాంగాన్ని తప్పుదోవ పట్టించే దిశగా పేదలను భయాందోళనకు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టం ప్రకారం పేదలు సాగు చేసుకుంటున్న భూమికి, పేదలకు రక్షణ కల్పించాల్సిన బాధ్యత రెవెన్యూ, పోలీసు యంత్రాంగాలకు ఉందన్నారు. చట్ట ప్రకారంగా సాగు చేసుకుంటున్న పేదలకు, భూమికి రక్షణ కల్పించాలని, పేదలకు పట్టాలు ఇవ్వాలని, లేనిపక్షంలో రానున్న రోజుల్లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో సాగు హక్కు కల్పించి పట్టాలు ఇచ్చేవరకు పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పులపాకుల వీర్రాజు, పిల్లి పోతురాజు, పి.వెంకటసుబ్బారావు, జి.సూర్యకిరణ్, కాకుల సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి - ఉంగుటూరు


ఉంగుటూరు : సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ

చేబ్రోలులో చెత్త పదార్థాల నిర్వహణ, సుప్రీం శిక్షణ కేంద్రాలను జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి శనివారం ఉదయం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల్లో సెగ్రిగేషన్ యాక్టివిటీ సక్రమంగా నిర్వహించడానికి తడి, పొడి చెత్త వేరువేరుగా ఇచ్చేలా గ్రామస్తులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అవగాహనతో గ్రామస్తులు వారి ఇంటి వద్దనే తడి, పొడి చెత్త వేరు చేసి ఇచ్చినట్లయితే సంపద తయారీ కేంద్రాల్లో సెగ్రిగేషన్ చేయటం సులభతరం అవుతుందని చెప్పారు. పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. పారిశుధ్య సిబ్బందికి ప్రతినెలా సంపద తయారీ కేంద్రం వద్ద వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఆరోగ్యం పట్ల వారికి అవగాహన కల్పించాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. సిఇఒతో పాటు సర్పంచి లక్ష్మీసునీత, మాజీ సర్పంచి రాజారావు, ఉంగుటూరు ఎంపిడిఒ జిఆర్.మనోజ్, డిప్యూటీ ఎంపిడిఒ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ముసునూరు :చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల ద్వారా గ్రామ పంచాయతీలు ఆదాయం పొందేలా చర్యలు చేపట్టాలని ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ చెప్పారు. మండలంలోని వలసపల్లి, ముసునూరు గ్రామాల్లోని కేంద్రాలను ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు ఆరేపల్లి వెంకటేశ్వరరావు, నీరజనాయుడు, కె.సుజాత, ధర్మవతి, పిఎస్‌కె.శ్రీనివాస్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మించాలని కన్నాయగూడెం వాసుల నిరసన


నిరసన తెలుపుతున్న కన్నాయగూడెం వాసులు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని కన్నాయగూడెం గ్రామ శివారు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం కారణంగా గత ఐదేళ్లుగా గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హైవే నిర్మాణంలో భాగంగా అతివేగంతో ప్రయాణించే లారీల వల్ల ఇళ్లలోకి దుమ్ము చేరుతోందని, దీంతో ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు వారు శనివారం రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాకాలంలో జిగురు మట్టి కారణంగా రోడ్లు జారుడుగా మారి, వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. గ్రీన్‌ఫీల్డ్ అధికారులను సమస్యలపై నిలదీస్తే సరైన సమాధానం ఇవ్వడంలేదని చెప్పారు. అధిక లోడుతో వెళ్లే వాహనాలపై ఆర్అండ్‌బి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని వాపోయారు. కొత్త రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేశారు. అధికారులు తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

విద్యాసామగ్రి అందజేత

ప్రజాశక్తి - కలిదిండి

మండలంలోని భాస్కరరావు పేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు రూ.మూడు లక్షల విలువైన స్కూల్ బ్యాగ్‌లు, పుస్తకాలు, పెన్నులను హ్యాండ్ ఇన్ హ్యాండ్ ఫౌండేషన్ ద్వారా రేమిల్లె సుందరరావు, ప్రభావతి దంపతుల కుమారులు సురేష్ కుమార్, సునీల్ కుమార్ అందించారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని టిడిపి మండలాధ్యక్షులు పోకల జోగిరాజు అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి ఆనంద్‌కుమార్, ఉపసర్పంచి సాలి మేరి కుమారి, మాజీ సర్పంచి మంతెన సుబ్బరాజు, సొసైటీ అధ్యక్షులు వసంతరావు, హెచ్ఎం సునీలా జ్యోతి, గ్రామ ప్రముఖులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

చింతలపూడి :డీపర్ లైఫ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఊటసముద్రం ఎంపియుపి స్కూల్ విద్యార్థులకు రూ.పది వేల విలువైన విద్యాసామగ్రి అందించారు. ఈ సందర్భంగా సొసైటీ నిర్వాహకులు బుచ్చిబాబు మాట్లాడుతూ ఈ సంస్థ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది పేద విద్యార్థులకు విద్యాసామగ్రి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం కాంతారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరావు, గారపాటి వెంకటేశ్వరరావు, ఆనంద శామ్యూల్, శాంతకుమారి పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు గిరిజనులు వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - టి.నరసాపురం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న సంక్షేమ పథకాలను గిరిజన ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ నగరాజ కుమారి సూచించారు. మండలంలోని కృష్ణాపురంలో శనివారం దర్తి ఆభజన్ భగీదరి అభియాన్‌పై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో సమస్యలు అడిగి తెలుసుకుని ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను వివరించారు. పలు సౌకర్యాలు కల్పించాలని గ్రామస్తులు కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ టి.సాయిబాబా, తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పదో తరగతి పరీక్షా ఫలితాల్లో రాణించిన జంగారెడ్డిగూడెం బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యా ప్రోత్సాహకాలు అందించారు. పాఠశాల ప్రాంగణంలో ప్రధానోపాధ్యాయురాలు గ్లోరీ ప్రశాంతి అధ్యక్షతన శనివారం నిర్వహించిన కార్యక్రమంలో హైదరాబాదుకు చెందిన కుర్రే భరత్, జ్యోత్స్నబిందు దంపతుల వితరణతో వారధి ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించిన ఇరువురు విద్యార్థినులకు విద్యాప్రోత్సాహకాలు అందించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయిని పి.నిర్మలాకుమారి, టిడిపి సీనియర్ నాయకులు, 17వ వార్డ్ కౌన్సిలర్ నంబూరి రామచంద్రరాజు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి వెంకట రామలక్ష్మి, సామాజికవేత్త కెవిఎస్.ధనకుమార్, వారధి ట్రస్ట్ ప్రతినిధులు మద్దిపాటి శ్రీను, వెలిచెర్ల ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

ప్రజాశకి - చింతలపూడి

స్థానిక చింతలపూడి జూనియర్ సివిల్ కోర్టులో ఈ నెల ఐదో తేదీన జరిగే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సిహెచ్.మధుబాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పెండింగ్ కేసుల పరిష్కారానికి జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని తెలిపారు. మెగా లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బిఎస్ఎన్ఎల్, రికవరీ, కుటుంబ తగాదాలు, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు, ఎక్సైజ్ కేసులు పరిష్కరించుకోవచ్చని తెలిపారు. ప్రతి రోజూ ఫ్రీ లోక్ అదాలత్ సిట్టింగ్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసులు రాజీ చేసుకోవడం ద్వారా విలువైన సమయం, డబ్బు ఆదా అవుతుందని తెలిపారు.

నూజివీడు టౌన్ :పట్టణంలోని కోర్టు సముదాయాల్లో జులై ఐదో తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు నూజివీడు మండల న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ.నాగశైలజ తెలిపారు. కక్షిదారులు న్యాయవాదుల ద్వారా ఇరు పార్టీలు రాజీకి వచ్చిన కేసులు లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఇతర వివరాలకు, సందేహాల నివృత్తికి మండల న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు.

అభ్యుదయవాది బొమ్మి రంగారావు

వర్ధంతి కారక్రమంలో ప్రముఖులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

అభ్యుదయ వాది, సిపిఐ అభిమాని బొమ్మి రంగారావు ఆశయాలను, ఆదర్శాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని బికెఎంయు జిల్లా ప్రధాన కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక కొత్తపేట బొమ్మి రంగారావు స్మారక గ్రంథాలయం వద్ద బొమ్మి రంగారావు స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో 30వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. బొమ్మి రంగారావు చిత్రపటానికి ఆయన తనయుడు ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడు బొమ్మ మురళి పూలమాలవేసి నివాళులర్పించారు. కొత్తపేట నరసింహ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ఎరేజరుతో పాటు అంగన్వాడీ పిల్లలకు ఐరన్ స్టాండ్‌ను బహుకరించారు.